క్లుప్తంగా

పోలీసులకు సహకరించాలి

సాక్షి, భీమవరం: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని జిల్లా అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యాన మంగళవారం పోలీస్‌లు, క్రీడాకారులకు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చేతుల మీదుగా హెల్మెట్లు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల అన్నివర్గాలను ప్రోత్సహిస్తూ క్రీడలు, సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్, టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటీపీలు చెప్పొద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ పథకాలు మంజూరయ్యాయి మీ ఫోన్‌కు ఓటీపీ వచ్చింది చూసి చెప్పండి అని ఎవరైనా ఫోన్ చేస్తే చెప్పవద్దని, ఇటువంటివి నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మఒడి తదితర పథకాలు మంజూరయ్యాయని మీ ఫోన్‌కు ఓటీపీ వచ్చింది చెప్పాలంటూ అపరిచితులు ఫోన్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏ పథకానికైనా ఓటీపీ అవసరమైతే సచివాలయ సిబ్బంది స్వయంగా లబ్ధిదారుల వద్దకే వచ్చి తెలుసుకుంటారని చెప్పారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థి ఎంపిక

సాక్షి, భీమవరం: కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన అండర్–19 సెలక్షన్స్‌లో భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి వి.నాగవీరయ్య ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నాగవీరయ్యను అభినందించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. ఈనెల 16వ తేదీన కొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సెలక్షన్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి మూడు రోజుల పాటు చిత్తూరు జిల్లా నగరిలో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నాగవీరయ్య పాల్గొంటాడని శ్రీనివాసరావు తెలిపారు.

తాళ్లకోడు జగనన్న కాలనీలో దసరా సంబరాలు

ఆకివీడు: సొంతింటి కల నెరవేరిందని మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడు జగనన్న కాలనీవాసులు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. కాలనీలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, భజనలు, లలితా పారాయణం చేశారు. వారాహి దేవీ యూత్ ఆధ్వర్యాన ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కాలనీలో గృహప్రవేశాలు చేసిన కుటుంబాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సంబరాలు జరుపుకుంటున్నారు. కాలనీలో విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరా లక్ష్యం



మాట్లాడుతున్న భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చర్యలు తీసుకున్నారని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు తెలిపారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలో రూ.20 కోట్లతో పైపులైన్లు, సంపులు, మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. అంతేకాక గ్రామానికి రూ.కోటి కేటాయించి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు పైపులైన్‌లు, ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇరిగేషన్ ఏఈ ఇందుకూరి ప్రసాదరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకారావు, ఎలక్ట్రికల్ ఏఈ నరసయ్య, అగ్రికల్చర్ ఏఈ నిమ్మల శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ ధనలక్ష్మి, పలువురు అధికారులు తమ శాఖల్లోని అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు తిరుమాని ధనంజయ రాజు, కొప్పర్తి పద్మజ, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, రామాని శివాజీ వర్మ, ఎంపీటీసీలు తిరుమాని తులసీరావు, కొప్పర్తి సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవాలి

ఉండి: గ్రంథాలయాలు మనిషి అభివృద్ధికి బాటలు వేస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అన్నారు. ఉండి శాఖా గ్రంథాలయంలో ఈనెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్న దసరా శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో సైన్సు, సాహిత్యం, కాంపిటేటివ్ వంటి విలువైన పుస్తకాలు ఉంటాయని వాటిని తప్పక చదవాలన్నారు. పుస్తకాలు చదివేందుకు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చే అలవాటు చేసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయుడు పి.శ్రీనివాస్, ఎం.మహంకాళి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతకు సీఎం జగన్ కృషి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం అర్బన్: భీమవరం మండలం బేతపూడిలో మహిళ హెల్త్ రిపోర్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం చినరంగని పాలెంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కాళ్ల: బొండాడలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న పీవీఎల్ నర్సింహరాజు

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్య భద్రతకు చేపడుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం బేతపూడి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశ్యంతో 108 ద్వారా వైద్య సేవలు, 104 వాహనాల ద్వారా ప్రతి గ్రామంలో 14 రకాల వైద్య పరీక్షలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా డాక్టర్ల బృందం ఇంటింటికీ రోగులను గుర్తించి వైద్యం అందివ్వడం, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రత్యేక వైద్యులతో రోగులకు వైద్యం చేయడం, అంతేకాక పేదలకు కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కొట్టి కుటుంబరావు, కడియం వెంకటేశ్వరరావు, సమతం ఉమా, బుంగా ప్రహ్లాదుడు, కడియం నాగభూషణం, సమతం రామకృష్ణ, నేతల ఇజ్రాయేల్, తంగెళ్ల కృష్ణ, పాకెర్ల పుల్లయ్య, సర్పంచ్‌లు ఆరేటి పెద్దబ్బి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో ప్రయోజనం

భీమవరం(ప్రకాశం చౌక్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య అన్నారు. మంగళవారం చినరంగని పాలెం మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిర్నా ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న అనేక మందికి జగనన్న సురక్ష ద్వారా స్థానికంగానే మల్టీస్పెషాలిటీ సేవలు లభిస్తున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల మాట్లాడుతూ శిబిరంలో 1,105 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోడే యుగంధర్, సాగి విజయ నర్సింహరాజు, చెల్లబోయిన సూర్య ప్రకాష్, గంటా సుందర్ కుమార్, పాలపర్తి జోనా, ఏసీపీ గౌరు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా

ఉండి: రాష్ట్ర ప్రజల నిండునూరేళ్ళ ఆరోగ్య జీవితానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా భరోసా కల్పిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మంగళవారం ఆయన ఉండి మండలం పాందువ్వలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఒకపక్క విద్య, మరోపక్క ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నిపుణులైన కార్పొరేట్ వైద్యులను గ్రామాలకు రప్పించి వారి ద్వారా ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు అల్లూరి రాంబాబురాజు, మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

కాళ్ల: ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం భద్రత కల్పిస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు స్పష్టం చేశారు. మండలంలోని బొండాడలో జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మన్నే నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పీవీఎల్ ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే వైద్యులను పంపించి ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పాడుతున్నారని కొనియాడారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ వైద్య శిబిరంతో ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించిన పీవీఎల్ ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామ కృష్ణంరాజు, మన్నే సోమేశ్వరరావు, మందపాటి రవి, విశ్వేశ్వరరావు, కట్టా సుబ్బయ్య, పెనుమత్స రంగరాజు, సాగిరాజు హరి వర్మ, కట్టా వెంకటరావు, వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే వైఎస్సార్ సీపీ లక్ష్యం



వీరవాసరం: బలుసుగొయ్యిపాలెంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి

వీరవాసరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు అన్నారు. బలుసుగొయ్యిపాలెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. శిబిరానికి విచ్చేసిన ప్రజలకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇళ్ల పూర్ణ బాల భారతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, ఇళ్ల శ్రీనివాస్, గొలగాని సత్యనారాయణ, వీరవల్లి శ్రీనివాస్, పి.జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యుడి కష్టాలు తెలిసిన జగనన్న

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- మహదేవపట్నంలో గడప గడపకు మన ప్రభుత్వం



ఉండి: మహదేవపట్నంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు



వీరవాసరం: మండలంలోని మడుగు పోలవరంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

ఉండి: ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా సామాన్యులు పడుతున్న కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మంగళవారం ఉండి మండలం మహదేవపట్నంలో ఉప సర్పంచ్ ముదునూరి సుబ్బరాజు ఆధ్వర్యాన రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. పీవీఎల్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రజాసంకల్ప యాత్రలో పేదల కష్టాలను దగ్గర నుంచి చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారన్నారు. అందుకే ప్రజలిచ్చిన అధికారాన్ని వారి సంక్షేమానికే ఖర్చుచేసి పురోభివృద్ధికి తోడ్పాటు అందించారన్నారు. అర్హులైన ప్రతి ఇంటికీ రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు లబ్ధిని అందించిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ మంచి ఎప్పుడూ ఇలాగే జరగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ వేగేశ్న రాంబాబురాజు, వేగేశ్న వెంకట్రామరాజు, బాలం తులసి, కడలి శ్రీనివాస్, దంపబోయిన భాను, బొక్కా శ్రీనివాస్, బలే శేఖర్, పస్తుల నారాయణ, గుత్తుల కృష్ణ, గుండు నాగేశ్వర రావు, కరిమెరక శివనాగరాజు, సూరవరపు వెంకటాచార్యులు, బి.రామకృష్ణ, బడుగు బాలాజీ, బొచ్చా అచ్చారావు, కన్నా సాహెబ్, పంచాయతీ కార్యదర్శి కె.పవన్‌కుమార్, సచివాలయ అధికారులు, వలంటీర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి హామీని నెరవేరుస్తున్నాం

వీరవాసరం: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, గత నాలుగేళ్ల పాలనలో 98 శాతానికి పైగా హామీలను అమలు చేశామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం మడుగు పోలవరం గ్రామంలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి గత నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ లబ్ధిని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరేలా నవరత్న పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. భీమవరం నియోజకవర్గంలో సుమారుగా 15 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పట్టాలు ఇచ్చామని, లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. గతంలో మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని, నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్రను వేసుకున్నారని అన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల అండదండలు పూర్తిగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, సర్పంచ్ బోణం నాగ పరమేశ్వరరావు, జొన్నల రాధాకృష్ణ, మల్లుల పాటియ్య, బండి బాలాజీ, గొలగాని సత్యనారాయణ, పాణుకు అశోక్ బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

భీమవరం అర్బన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) భీమవరం ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ మంగళవారం తన సిబ్బందితో కలసి మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దిరుసుమర్రు గ్రామానికి చెందిన గుడాల శ్రీనును 11 మద్యం సీసాలతో అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. 1వ అదనపు న్యాయస్థానంలో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ దాడిలో ఎస్ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్లు జి.సునీల్ కుమార్, బి.రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, డేవిడ్ రాజు, గణేష్, శాలిని పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చేపల ప్యాకింగ్ కార్మికుడి మృతి

ఆకివీడు: స్థానిక అమృతరావు కాలనీకి చెందిన చేపల ప్యాకింగ్ కార్మికుడు ఉప్పాటి కుమార్(36) రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై నాగబాబు చెప్పారు. ఈనెల 16వ తేది సాయింత్రం స్థానిక వెంకయ్య వయ్యేరు వంతెన సమీపంలో నడుచుకుంటూ వస్తున్న కుమార్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొట్టినట్లు తెలిపారు. గాయపడిన అతనికి స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపూసలమర్రు గ్రామానికి చెందిన బర్రె నాగలక్ష్మి తన భర్త ఏసు, అదే గ్రామానికి చెందిన జట్టు మేస్త్రి కొక్కిలిగడ్డ నాగరాజుతో కలసి చెన్నై శివారు ఉపాధి కోసం గత నెల 9న కూలి పనులకు వెళ్లారు. ఈనెల 7న తిరిగి సొంతూరు వస్తుండగా సూళ్లూరు పేట వద్ద నుంచి నాగలక్ష్మి భర్త కనిపించకపోవడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిలిస్ట్‌పై దాడి

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామానికి చెందిన మేరుగుమిల్లి దుర్గాప్రసాద్ సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు అడ్డరోడ్డులో ఖాళీ సీసాతో అతని తలపై కొట్టగా గాయపడినట్లు ఎస్సై నాగబాబు మంగళవారం తెలిపారు. అకారణంగా గొడవ పడి ఆకివీడు రైల్వే గేటు ప్రాంతానికి చెందిన వలుపు మురళి, పాల విక్రమ్‌లు సీసాతో కొట్టినట్లు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయత్రి, అన్నపూర్ణాదేవిగా అమ్మవార్ల దర్శనం



భీమవరం(ప్రకాశం చౌక్): గాయత్రీదేవి అలంకరణలో పార్వతీదేవి

భీమవరం(ప్రకాశం చౌక్): దసరా మహోత్సవాలు భీమవరం పట్టణంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు మంగళవారం అమ్మవార్లు గాయత్రీదేవిగా పూజలు అందుకున్నారు. పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మకర్తలు, అలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పంచారామ క్షేత్రంలో కొలువైన శ్రీ పార్వతీదేవి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. అలాగే శ్రీ ఉమా సోమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ కార్యనిర్వహణాధికారి డి.రామకృష్ణంరాజు, ధర్మకర్తలు పర్యవేక్షించారు. నాచువారి సెంటర్‌లోని శ్రీ కనక దుర్గమ్మవారిని గాయిత్రీదేవిగా అలంకరించగా, అర్చకుడు పవన్ ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఒంటెద్దు బళ్ల సంఘ సభ్యులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో కొలువైన శ్రీ మహిషాసుర మర్దని అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కాళ్లలో..

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం నందు అమ్మవారు భక్తులకు శ్రీ ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి శ్రీ చక్ర అభిషేకం నిర్వహించారు. అలంకరణ దాతలు రుద్దరాజు వెంకట సుబ్రహ్మణ్య నరసింహరాజు, అనూష దంపతులు ఉదయం కుంకుమ పూజలు చేశారు. దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తలు, ఈవో మోకా అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.

ఆకివీడు: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవార్ల అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మార్కండేశ్వరస్వామి ఆలయం వద్ద లలితా హోమం ఆలయ నిర్వాహక కమిటీ చైర్మన్, కార్యదర్శి గొంట్లా గణపతి దంపతులు, కాకర్ల రాజేశ్వరి చేశారు. పెద్దింటి అమ్మవారి ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

నేడు మోగల్లులో అంగన్‌వాడీ భవనం ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనం

పాలకోడేరు: మండలంలోని మోగల్లులో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనం ప్రారంభానికి సిద్ధమైంది. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు బుధవారం నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ భవన నిర్మాణానికి నాబార్డు నిధుల నుంచి రు.12 లక్షలు మంజూరు కాగా, మండల పరిషత్ నిధులు రూ.లక్ష కలిపి మొత్తం రూ.13 లక్షలతో నిర్మించారు. ప్రస్తుతం కమ్యూనిటీ హాల్ భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరి శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌కు విన్నవించుకున్నారు. ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు నిధులు మంజూరు చేయించి అంగన్‌వాడీ కేంద్రానికి భవన నిర్మాణం పూర్తి చేశారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

సాక్షి, భీమవరం: జిల్లాలో సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత సార్వా సీజన్‌లో సాగు నీరందక పాలకోడేరు, ఉండి, ఆకివీడు, కాళ్ళ, వీరవాసరం, పెనుమంత్ర, ఆచంట, పోడూరు, పెనుగొండ, యలమంచిలి మండలాల్లోని కాలువ శివారు గ్రామాల్లో వరి చేలకు నీరందకపోవడంతో పంటకు నష్టం వాటిల్లుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వరి పైరు ప్రస్తుతం ఈనిక, పొట్ట, పాలుపోసుకునే దశలో ఉందని, ఇటువంటి తరుణంలో సక్రమంగా నీరందకపోతే పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం ఉంటుందని, రైతాంగం నష్టపోతారని పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ, వ్యవసాయశాఖాధికారులు సమన్వయంతో సాగు నీటి కొరత లేకుండా చూడాలని ఆయన కోరారు.

గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు



బేతపూడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: గ్రామాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. భీమవరం మండలం బేతపూడి పంచాయతీ యమునాపల్లిలో రూ.12 లక్షలు, బేతపూడిలో రూ.12 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూట్ మ్యాప్ తయారు చేసినట్లు చెప్పారు. ప్రజలకు పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు జల్ జీవన్ మిషన్ పథకంలో మొదటి విడతగా రూ.20 కోట్ల నిధులు మంజూరైట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఉండేలా పైపులైన్ ఉచితంగా వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహ రాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహసీల్దార్ వై. రవి కుమార్, పంచాయతీరాజ్ డీఈ స్వామి నాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ కొట్టి కుటుంబరావు, కడియం వెంకటేశ్వరరావు, బుంగా ప్రహ్లాదుడు, సమతం ఉమా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తున్నాం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, పట్టణంలోనూ శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేస్తున్నామన్నారు. గత చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధిని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అందుకే ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే పూర్తి మద్దతుగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 175 సీట్లకు 175 సీట్లను గెలుచుకుంటామని ఇందులో ఎటువంటి సందేహం లేదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వాసర్ల ముత్యాలరావు, రాజేష్, వాసార్ల ప్రవీణ్, కొత్తల కృష్ణబాబు, కుక్కల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

వార్డులో ప్రభుత్వం రూ.21 లక్షలతో నిర్మిస్తున్న రజక కమ్యూనిటీ హాల్, ఇతర సౌకర్యాల నిమిత్తం చామ సాయి బాబు రూ.25 వేల చెక్కును ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు అందించారు. సాయిబాబా దాతృత్వం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

పలు రోడ్లకు గ్రీన్ సిగ్నల్

మారుతి నగర్‌లో పలు అంతర్గత రోడ్ల నిర్మాణంపై స్థానిక ప్రజలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిశారు. దీంతో ఆయన స్వయంగా ప్రజలు కోరిన రోడ్ల వద్దకు నడిచి వెళ్లి వాటిని పరిశీలించి వెంటనే రోడ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలను ఆదేశించారు.